క్లుప్తంగా

రీ సర్వే వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న గూడూరు డివిజనల్ సర్వే అధికారి సుబ్బరాయుడు

దక్కిలి: భూముల రీ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని గూడూరు డివిజనల్ సర్వే అధికారి సీహెచ్ సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండల సర్వేయర్ పెంచలయ్య అధ్వర్యంలో విలేజ్ సర్వేయర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రీ సర్వే పనులు పారదర్శకంగా నిర్వహించాలని తెలియజేశారు.

జంట నాగుల విగ్రహ పత్రిష్ట



సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి

రాపూరు: మండల కేంద్రంలోని వరసిద్ధి వినాయక దేవాలయంలో నవగ్రహ, జంటనాగుల విగ్రహ ప్రతిష్ఠ, సిద్ధిబుద్ధి సహిత వరసిద్ధి వినాయకస్వామి శాంతి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, నవగ్రహ మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసం, క్షీరాధివాసం శాంతికల్యాణం, అన్నదానం నిర్వహించారు.

కలిచేడులో కేంద్ర నీతి అయోగ్ బృందం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న నీతి అయోగ్ బృందం

సైదాపురం : మండలంలోని కలిచేడు అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం కేంద్ర నీతి ఆయోగ్ బృందం తనిఖీ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఆరా తీసింది. లబ్ధిదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రాపూరు సీడీపీఓ సునంద, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

గూడూరురూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో బుధవారం డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆరోగ్య సంజీవని కార్యక్రమంలో భాగంగా ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో హెచ్.ఐ.వి.బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల ఆయు ప్రమాణాలు పెంచేందుకు ప్రతి నెలా క్రమం పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు.

వెంకటగిరి జట్టు విజయకేతనం



బహుమతులు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి విష్ణువర్మ

వెంకటగిరి రూరల్: పట్టణంలోని తారకరామ క్రీడా ప్రాంగణంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న ఫ్రెండ్‌షిప్ కప్ టోర్నీలో బెంగుళూరు జట్టుపై వెంకటగిరి జట్టు విజయకేతనం ఎగుర వేసింది. ఈ మేరకు గెలుపొందిన వెంకటగిరి జట్టుకు వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి విష్ణువర్మ, సీఐ ఏవీ రమణ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

సైదాపురం: నిమ్మలో యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులతో పాటు అధిక లాభాలను పొందవచ్చని ప్రాంతీయ ఉద్యాన పరిశోధన స్థానం, వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్ర వేత్తలు జి తనూజ శివరామ్, డాక్టర్ ఎల్ రంజిత్ పేర్కొన్నారు. మండలంలోని కోమటిగుంటరాజుపాళెం గ్రామంలో బుధవారం గిరిజన రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం షెడ్యూల్డ్ క్యాస్ట్ సబ్ ప్లాన్ కింద 52 మంది నిమ్మ రైతులకు పరికరాలను అందజేశారు.

చికెన్ ధరలు		09-10-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	118
లేయర్ లైవ్	:	122
బ్రాయిలర్ చికెన్	:	214
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	236
లేయర్ చికెన్	:	207

కార్యకర్తలకు డిజిటల్ భరోసా



డిజిటల్ బుక్ స్కానర్‌ను ఆవిష్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, మేరిగ మురళీధర్



కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- రాపూరులో డిజిటల్ బుక్ పోస్టర్ల ఆవిష్కరణ
- హాజరైన నేదురుమల్లి, మేరిగ మురళీధర్

రాపూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఈ డిజిటల్ బుక్ భరోసానిస్తుందని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే డిజిటల్ బుక్‌లో లాగిన్ అయి వివరాలను నమోదు చేస్తే పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. మండలంలోని సంక్రాంతిపల్లి సమీపంలో ఉన్న పాపకన్ను మధుసూదన్‌రెడ్డి గార్డెన్‌లో బుధవారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ ఎస్ఈసీ సభ్యులు పాపకన్ను మధుసూదన్ రెడ్డి, మస్తాన్ యాదవ్‌తో కలసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. నేదురుమల్లి మాట్లాడుదూ చంద్రబాబు మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోయారని ఆయనకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం దొంగ కేసులు, అరాచకాలు, అంతులేకుండా పోతున్నాయని దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజలను కాపాడుకునేందుకు డిజిటల్ బుక్‌ను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తే పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇందులో వీడియో, ఆడియోలు, అన్యాయానికి సంబంధించిన ప్రతి ఒక్కటి పొందుపరచాలని సూచించారు. మన ప్రభుత్వం వస్తే వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఏ అధికారి అన్యాయం చేశారో వారందరికీ శిక్ష తప్పదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే కార్యకర్తలకు పెద్దపీట వేస్తామని అధినేత భరోసా ఇచ్చారన్నారు. అనంతరం యాప్ వివరాలను ఎలానమోదు చేయాలో విడియోరూపంలో అవగాహన కల్పించి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాని వినిపించారు.

పార్టీ శ్రేణులకు అండ

కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు, కేసులు ఎక్కువయ్యాయని అటువంటి వారందరికీ అండగా ఉండేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. ఈ డిజిటల్ బుక్ విధానం తెలుసుకున్న కూటమి నాయకుల్లో భయాందోళనకు గురవుతున్నారని ఇప్పటికే కొందరు విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. పార్టీ నాయకుల ఆదేశాల మేరకు త్వరలో గ్రామస్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేయనున్నారని గ్రామాల్లోని నాయకులు వైఎస్సార్‌సీపీపై అభిమానం, గౌరవం ఉన్న యువత, రైతులు, మహిళలను ఆ కమిటీల్లో పేరు చేర్చేలా చూడాలని సూచించారు. గ్రామ స్థాయిలో వైఎస్ జగన్ సైన్యం ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఎస్ఈసీ సభ్యులకు అభినందన

వైఎస్సార్‌సీపీ ఎగ్జికూటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఎంపికైన పాపకన్ను మధుసూదన్‌రెడ్డిని, మస్తాన్‌యాదవ్‌ను నేదురుమల్లి, మేరిగ మురళీధర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొడ్డు మధుసూదన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషనర్ దందోలు లక్ష్మీనారాయణరెడ్డిని, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా, నియోజకవర్గ వలంటరీ విభాగ అధ్యక్షులు దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాపకన్ను దయాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటసుబ్బయ్య, కలపాటి మధుసూదన్‌రెడ్డి, నారాయణరెడ్డి, గణేష్‌రెడ్డి, డివి రమణయ్య, రత్నాకర్‌రెడ్డి, రమణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధినేతతో శ్రీమంత్‌రెడ్డి



సూళ్లూరుపేట : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఆయన తల్లి, వార్డు కౌన్సిలర్ దబ్బల సౌధామిని పుష్ప గుచ్ఛం ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల పార్టీ కేంద్ర కమిటీ వారు స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎంపిక చేసినందుకు జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని 20 పంచాయతీల్లో ఉపాధి కూలీలకు ఈకేవైసీ చేసే పక్రియను బుధవారం ఉపాధిహామీ ఏపీడీ గాయత్రీదేవి పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఉపాధి కూలీలందరికీ ఈకేవైసీ పూర్తి చేస్తే ఖాతాల్లో నగదు జమ అవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ సునీల్, ఈసీ ఉమాదేవి, టీఏలు నరసింహారెడ్డి, వినోద్, మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

చిల్లకూరు : ఉపాధి కూలీలకు సంబంధించి ఈకేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయాలని ఏపీఓ గిరిబాబు సూచించారు. మండలంలోని ఉపాధి కార్యాలయంలో బుదవారం ఆయన ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న 4 వేల జాబ్ కార్డులకు ఈకేవైసీని పూర్తి చేయాలని సూచించారు.

ఆదమరిస్తే అంతే సంగతి



శిథిలావస్థలో ఉన్న కల్వర్టు



పగిలిన కల్వర్టు గోడలు

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామ చెరువుకు మధ్యలో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు హడలిపోతున్నారు. కల్వర్టు నిర్మించి చాలా కాలం కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. కల్వర్టు ఇరువైపులా గోడలకు పగుళ్లు వచ్చాయి. ఈ మధ్య కాలంలో ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిపై మల్లాం గ్రామం వాకాడు మండలంలోని సుమారు 15 గ్రామాల ప్రజలు ఈ దారినే రాకపోకలు సాగించాలి. ఈ కల్వర్టు ఎప్పుడు కూలిపోతుందోనని హడలిపోతున్నారు. రాత్రి సమయాల్లో ఈ దారిన ప్రయాణించాలన్నా, కల్వర్టుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలకు దారి ఇవ్వలన్నా ఇబ్బందికరంగా ఉందని వాహన దారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రకృతిని కాపాడుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎఫ్ఆర్ఓ సౌజన్య

దొరవారిసత్రం : ప్రకృతిలోని జంతువులు, పక్షులు, జీవరాసులు వంటి వాటితో పాటు అడవులను కాపాడుకుంటేనే వాతావరణం సమతుల్యంగా ఉంటుందని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సౌజన్య అన్నారు. పక్షుల కేంద్రంలో బుధవారం స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు ఏకొల్లు గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేచర్ క్యాంప్ నిర్వహించారు. ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ ప్రకృతి, వలస విహంగాలు, అడువుల వంటి వాటి గురించి ప్రతి విద్యార్థి తెలుసుకుంటే వాటి విలువ తెలుస్తుందన్నారు. విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎఫ్ఎస్ఓ బాలయ్య, ఉపాధ్యాయుడు లక్ష్మీపతిరావు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఈసీ సభ్యుడు బొలిగర్లకు అభినందనలు



మస్తాన్‌యాదవ్‌ను అభినందిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి (సైదాపురం): పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ బొలిగర్ల మస్తాన్ యాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం మస్తాన్‌యాదవ్‌ను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శాలువ, పుష్పగుచ్చంతో అభినందించారు. ఆయనతోపాటు మస్తాన్‌యాదవ్‌ను కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, విప్ పూజారి లక్ష్మితోపాటు కౌన్సిలర్ ఆరి శంకరయ్య, కల్లు సతీష్ భినందించారు.

రామిరెడ్డి కుటుంబానికి నేదురుమల్లి పరామర్శ

రాపూరు: మండలంలోని సైదాదుపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు దందోలు రామిరెడ్డి ఇటీవల కన్నుమూయడంతో, ఆ కుటుంబాన్ని నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి బుధవారం పరామర్శించారు. రామిరెడ్డి ఇంటికెళ్లిన నేదురుమల్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆయిల్ పామ్‌పై అవగాహన

దక్కిలి: మండలంలోని తీర్థంపాడు గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు బుధవారం వెంకటగిరి ఉద్యానశాఖ అధికారి ఆనంద్‌రెడ్డి అవగాహన కల్పించారు. తీర్థంపాడు గ్రామంలో రైతులు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయిల్ పామ్‌లో అధిక దిగుబడులు సాధించడానికి పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ఆయిల్ పామ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆయిల్ పామ్ మొక్కలను అందించనున్నట్లు తెలిపారు.

పరిశ్రమ పనుల అడ్డగింత

చిల్లకూరు: తీర ప్రాంతంలోని మోమిడి రెవెన్యూ పరిదిలో కేపీసీఎల్‌కు కేటాయించిన భూముల్లో సోలార్ యూనిట్ పనులు చేపట్టేందుకు పరిశ్రమ ప్రతినిధులు భారీ వాహనాలతో దిగిపోయారు. అయితే సమాచారమందుకున్న వరగలి, తాళ్లబైట, మోమిడి గ్రామాలకు చెందిన వారు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. దీంతో పరిశ్రమ ప్రతినిధి హర్షరెడ్డి అక్కడికి చేరుకోవడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. గ్రామస్తులు మాట్లాడుతూ, 18 ఏళ్ల క్రితం భూములు తక్కువ ధరలకు కొనుగోలు చేసి స్వాధీనం చేసుకుని ఇప్పటివరకు అతీగతి లేకుండా పోయిందన్నారు. పక్కనే క్రిస్ సిటీకి భూములిచ్చిన రైతులకు రూ.8 లక్షల వరకు పరిహారం అందించారని, తమకు ఆ మొత్తం పరిహారం అందించి పనులు చేసుకోవాలని భీష్మించుకుని కూచున్నారు. దీంతో పరిశ్రమ ప్రతినిధులు పనులు నిలిపేశారు.

వృద్ధాశ్రమానికి చేయూత



సరుకులు అందజేస్తున్న విద్యార్థులు

గూడూరురూరల్ : గూడూరు పట్టణంలోని వాటర్‌ట్యాంకు వద్ద ఉన్న ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమానికి బుధవారం శ్రీగాయత్రి ఇంగ్లీషు మీడియం స్కూల్ 10వ తరగతి విద్యార్థులు, యాజమాన్యం కలిసి నెలకు సరిపడా ఫల సరుకులను అందించారు. స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, ఆశ్రమ నిర్వహకురాలు కల్యాణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అశ్వత్థ నారాయణ కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, దంపతులు

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ప్రభావతమ్మ దంపతుల ఆధ్వర్యంలో అశ్వత్థ నారాయణ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న నాగార్పమ్మ ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి అశ్వత్థ నారాయణ స్వామి (వేప, రావిచెట్ల) కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీరాముల రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మురళి, శ్రీనివాసులు, రంగయ్య పాల్గొన్నారు.

ఆ న్యాయవాదిని శిక్షించాలి



ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గూడూరురూరల్ : సుప్రీంకోర్టు సీజేఐ బి.ఆర్.గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని భారత రాజ్యాంగ పరిరక్షణ ఐక్యవేదిక, ప్రజా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. గూడూరు టవర్‌క్లాక్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఎదుట వారు బుధవారం వర్షంలోనే ధర్నా చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనాను కలిసి వినతిపత్రం అందజేశారు.

అంధ విద్యార్థికి ఆర్థిక సాయం



నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న దాతలు

సూళ్లూరుపేట : తిరుచానూరులోని నవజీవన్ పాఠశాలలో చదువుతున్న మురారి హర్షవర్ధన్‌కు సూళ్లూరుపేట పట్టణానికి చెందిన ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారు బుధవారం రూ.20 వేల నగదును అతని తల్లి రాజకుమారికి అందజేశారు. అంధుడైన హర్షవర్ధన్‌లో స్కేటింగ్ నేర్చుకోవాలనే ఆకాంక్ష చూసి, అతడిని ప్రోత్సహించేందుకు ఆచార్య భరద్వాజ సేవా సంస్థ వారు ఆర్థిక సాయాన్ని అందించారు.

తిమ్మనాయుడుపాళెంలో రేషన్ పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..

కోట: మండలంలోని తిమ్మనాయుడుపాళెం గ్రామంలో రేషన్ సరుకులు పంపిణీ చేయక పోవడంపై ×సాక్షి☒ దినపత్రికలో బుధవారం తిమ్మనాయుడుపాళెంలో రేషన్ కష్టాలు శీర్షికన వచ్చిన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఆర్వో క్రిష్ణయ్య ఆధ్వర్యంలో కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేశారు.



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున వీఆర్వో

ఆక్రమిత గంగ కాలువ పరిశీలన

చిట్టమూరు: మండల పరిధిలోని నార్తువరత్తూరు గ్రామ కాట్రేవు చెరువు కట్ట వద్ద ఆక్రమించిన తెలుగుగంగ కాలువను ఆ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. కాలువ ఆక్రమణపై బుధవారం సాక్షిలో దర్జాగా భూ ఆక్రమణ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తెలుగుగంగ డీఈ నాగేశ్వరారవు, ఏఈ మునిజ్యోతి బాబులు నార్తువరత్తూరు గ్రామంలో ఆక్రమణకు గురైన తెలుగు గంగ కాలువ పరిశీలించారు. ఆక్రమణదారులను పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. నాలుగు రోజుల్లో ఆక్రమించి చదును చేసిన కాలువను మళ్లీ తవ్వి సోమవారం లోపు యథావిధిగా చేయాలని కబ్జాదారులకు ఆదేశించారు. లేకుంటే సోమవారం పరిశీలించి ఆక్రమణదారులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు అధికారులు తెలిపారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కూటమి సహకరించాలి



డీఆర్ఎంకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సూళ్లూరుపేట : పట్టణం నడిబొడ్డున ఉన్న రాఘవయ్యపేట రైల్వేగేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాల్సి ఉందని సదరన్ రైల్వే డివిజనల్ మేనేజర్ శైలేంద్రసింగ్ పేర్కొన్నారు. ఆయన బుధవారం సాయంత్రం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను పరిశీలించి ఇక్కడి ప్రయాణికులతో ఇష్టాగోష్ఠి సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం తమకు సహకరిస్తే సూళ్లూరుపేటలో అండర్ బ్రిడ్జి నిర్మించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పలు సమస్యలపై రైల్వే ప్రయాణికులు డీఆర్ఎంకు వివరించారు. ఈ సమస్యలన్నింటిపై వినతి పత్రాన్ని స్థానిక వ్యవసాయ మార్కెంటింగ్ కమిటీ చైర్మన్ అకుతోట రమేష్, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి తదితరులు సమర్పించారు.

నాయుడు పేట రైల్వేస్టేషన్‌లో..

నాయుడుపేటటౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్‌ను బుధవారం సాయంత్రం చెన్నై సదరన్ రైల్వే డీఆర్ఎం శైలేంద్ర సింగ్ పరిశీలించారు. పలు సమస్యలపై డీఆర్ఎంకు వినతి పత్రాలు అందించారు.

ప్రమాదకరంగా మలుపు



ఓజిలి: మండలంలోని పున్నేపల్లి గ్రామంలో వినాయకుని ఆలయం వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. రహదారికి ఇరువైపులా నివాసాలు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారి మలుపు వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. అధికారులు స్పందించి మలుపు వద్ద గుంతలు పూడ్చి సూచికబోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సైదాపురంలో కురుస్తున్న వర్షం



సైదాపురం: బురదగుంటగా మారిన రోడ్డు





డీవీ సత్రం: నేలపట్టు పక్షుల కేంద్రం ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షం

భారీ వర్షం.. రోడ్లు జలమయం

వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు బురదగుంటలు మారాయి. బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతవరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో సుమారు అరగంట పాటు భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా నేలపట్టు, మైలాంగం, డీవీ సత్రం, కలగుంట, నెలబల్లి, వేణుంబాకం, పాళెంపాడు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. డక్కిలిలో సాయంత్రం వరకు భారీ వర్షం కురవడంతో వీధులు, రోడ్లు జలమయం అయ్యాయి. సైదాపురం మండలంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొంత మేరకు చెరువుల్లో నీరు చేరుతోంది. కైవల్యానదిలోకి జోరున వరదనీరు వచ్చి చేరుతుంది. ఈ వర్షాలకు సైదాపురం-పొదలకూరు మార్గం అధ్వాన్నంగా తయారైంది.

- దొరవారిసత్రం/డక్కిలి/సైదాపురం



డక్కిలి : హైస్కూల్ నుంచి జోరు వర్షంలో వస్తున్న విద్యార్థులు